సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 11 । జూలై । 2024



సోమశిలలో 9.967 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం నాటికి 9.967 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 189 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) రూ.74,980
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా) రూ.6,734
3 శాతం జీఎస్టీతో రూ.6,936
నవర (8 గ్రా) రూ.55,488

గరిష్టం/కనిష్టం
37.9 /28.0

వాతావరణం

గాలిలో తేమ 58 శాతంగా బుధవారం నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా ఆకాశం గురువారం మేఘావృతమయ్యే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

సోమేశ్వరాలయంలో దేవదాయ శాఖ సీఈ



సోమశిల: అనంతసాగరం మండలంలోని సోమశిలలో గల సోమేశ్వరాలయ పునర్నిర్మాణ నిమిత్తం రాష్ట్ర దేవదాయ శాఖ సీఈ జీవీఆర్ శేఖర్ బుధవారం విచ్చేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు వచ్చిన ఆయన ఆలయాన్ని పరిశీలించారు. పునర్నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను పర్యవేక్షించారు. దేవదాయ శాఖ రాష్ట్ర స్థపతి పరమేశ్వరమ్మ, జిల్లా స్థపతి సురేంద్ర, గుంటూరు జోన్ డీఈ కోవూరు జనార్దన్‌రావు, జిల్లా ఏఈ మురళి, దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటింటి సర్వే



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెంచలయ్య తదితరులు

నెల్లూరు(అర్బన్): కుష్టు వ్యాధి రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో ఈ నెల 18 నుంచి వచ్చే నెల రెండు వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించే పోస్టర్లను నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. పీహెచ్‌సీల వైద్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్వేలో ఆశ వర్కర్‌తో పాటు ఒక పురుష వలంటీర్ పాల్గొనాలని కోరారు. ప్రతి ఇంట్లో స్త్రీలతో ఆశ వర్కర్ మాత్రమే మాట్లాడాలన్నారు. శరీరంపై నల్లటి, తేనె రంగు, రాగి రంగులో మచ్చలున్నాయానే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. అనుమానపు మచ్చలుంటే సమీపంలోని పీహెచ్‌సీ వైద్యాధికారితో పరీక్షించాలని తెలిపారు. ఏడీఎంహెచ్‌ఓ, కుష్టు నివారణాధికారి ఖాదర్‌వలీ, డీఎస్‌ఎం డాక్టర్ సురేంద్రబాబు, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

టీచ్ టూల్‌పై 18 నుంచి శిక్షణ



మాట్లాడుతున్న రామారావు

నెల్లూరు (టౌన్): జిల్లాలో సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ద్వారా టీచ్ టూల్‌పై శిక్షణను ఈ నెల 18 నుంచి 26 వరకు నిర్వహించనున్నామని డీఈఓ రామారావు తెలిపారు. ఆయా డివిజన్ కేంద్రాల్లో ఎంపికైన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమిక స్థాయి ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రెయినర్లు శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. టీచ్ టూల్ కార్యక్రమ విజయవంతానికి ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. డిప్యూటీ డీఈఓలు లక్ష్మీప్రసన్న, రఘురామయ్య, ఏఎంఓ సుధీర్‌బాబు, సాల్ట్ ప్రోగ్రామ్ జిల్లా కోఆర్డినేటర్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



కలిగిరి: కలిగిరిలోని ఎరువులు, ఫర్టిలైజర్స్, విత్తనాల దుకాణాల్లో తనిఖీలను విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఏడీఏ రమణ బుధవారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గుర్తింపు ఉన్న కంపెనీల మందులు, ఎరువులు, విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. కొనుగోలు చేశాక బిల్లులను రైతులు విధిగా పొందాలని కోరారు. అనంతరం దుకాణాల్లోని స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఏడీఏలు నర్సోజీరావు, రామిరెడ్డి, ఏఓ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురులు

విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్న టీడీపీ నేతలు

- ఫలితాలు వెలువడిన రోజు నుంచి ఇదే తంతు
- సరిహద్దులు దాటిస్తున్న వైనం
- గతంలో 11 రీచ్‌లు.. ఐదు డిపోలు
- ప్రస్తుతం రీచ్‌లకు ఎగనామం.. మూడు డిపోలకే పరిమితం

ఇసుక ఉచితం అంటూనే సరికొత్త దోపిడీకి ప్రభుత్వం తెరలేపింది. ఈ తరహా బూటకపు ప్రకటనలు చూసి స్టాక్ పాయింట్ల వద్దకు వెళ్తున్న వినియోగదారులు అక్కడ ధరల పట్టికను చూసి గుడ్లు తేలేస్తున్నారు. ఇలా అవాస్తవాలను వ్యాప్తి చేసి ప్రజలను మోసం చేస్తున్న టీడీపీ.. తమ నేతలతో ఇసుక దందాను స్టార్ట్ చేయించింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచే ఆ పార్టీ నేతలు బరితెగించి అక్రమ రవాణాకు తెరలేపారు. జిల్లానే కాకుండా రాష్ట్ర సరిహద్దులను దాటిస్తూ కోట్లు గడిస్తున్నారు. నిరంతరం వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలిస్తున్నా, చోద్యం చూడటం అధికారుల వంతవుతోంది.



నెల్లూరు(సెంట్రల్): సహజ సిద్ధంగా లభించే ఇసుకపై తెలుగు తమ్ముళ్ల కన్నుపడింది. కౌంటింగ్ రోజున టీడీపీ అధికారంలోకి వస్తుందని ఫిక్సవడంతో వీరి దృష్టి ఇసుకపై పడింది. నాటి నుంచే ఈ వ్యవహారం జిల్లాలోని అధికార పార్టీ పెద్దల కనుసన్నల్లో జరుగుతోంది. ప్రస్తుతం ఈ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు అనే చందంగా సాగుతోంది.

గతానికి.. నేటికీ ఎంత వ్యత్యాసమో

గత ప్రభుత్వంలో ఇసుక విషయంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగినంత మేర సరఫరా చేసేవారు. అక్రమంగా రవాణా కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు వినియోగదారులకు కావాల్సినంత మేర అందజేసేవారు. సోమశిల నుంచి పల్లిపాడు వరకు ఉన్న పెన్నా తీరం వెంబడి గతంలో ఎనిమిది నుంచి 11 రీచ్‌లను ఏర్పాటు చేసి ఇసుకను అందుబాటులో ఉంచారు. వర్షాకాలంలో ఇసుక లభ్యతలో ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా ఐదు డిపోలను ఏర్పాటు చేసి అందులో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉంచిన పరిస్థితి.

ప్రస్తుతం రీచ్‌ల మాటేదీ..?

సోమశిల జలాశయం మొదలుకొని పెన్నాతీరం వెంబడి నీరు ప్రస్తుతం లేదు. గతంలో ఏర్పాటు చేసిన రీచ్‌లలోనూ ఇదే పరిస్థితి. ఈ క్రమంలో రీచ్‌లకు వాహనం నేరుగా వెళ్లి ఇసుకను తరలించేందుకు అవకాశాలున్నాయి. అయితే రీచ్‌లను ప్రభుత్వం ఎందుకు ఏర్పాటు చేయలేదనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కేవలం మూడు డిపోల ద్వారానే ఎందుకు విక్రయిస్తున్నారో ఎవరికీ అంతుచిక్కడంలేదు. గతంలో ఏర్పాటు చేసిన రీచ్‌లలో ఇసుకను ప్రస్తుతం అందుబాటులోకి తీసుకురాకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అంతా పక్కా ప్రణాళిక

ప్రభుత్వం పక్కా ప్రణాళికతోనే మూడు ఇసుక డిపోలతోనే సరిపెట్టిందనే ప్రచారం సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని నరసింహాపురం, వెంకటాచలం, మర్రిపాడు, మినగల్లు, పల్లిపాడు, నెల్లూరుపాళెం, సంగం ప్రాంతాల్లో ఇసుక డిపోలను ఏర్పాటు చేశారు. ఇందులో దాదాపు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ ఉంచారని సమాచారం. అయితే ప్రస్తుతం పల్లిపాడు, మినగల్లు, మర్రిపాడు ప్రాంతాల్లోనే ఇసుక డిపోలను అధికారులు చూపిస్తున్నారు. వీటిలో తక్కువగా ఇసుక ఉందని లెక్కలు చూపుతున్నారు. మిగిలిన డిపోల్లోని ఇసుకను ఎవరు తరలించారు.. అది ఎక్కడికి వెళ్లిందో పైవాడికే ఎరుక. మరోవైపు ప్రస్తుతం ఉన్న మూడు డిపోల్లో దాదాపు 2.4 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంటే.. అధికార పార్టీ నేతల ఒత్తిడితో స్థానికంగా ఉండే రెవెన్యూ అధికారులు దాన్ని 1.7 లక్షల మెట్రిక్ టన్నులకు పరిమితం చేస్తూ లెక్కలు చూపుతున్నారని సమాచారం.

ఫలితాలొచ్చాయి.. గద్దల్లా వాలారు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు గత నెల నాలుగున వెలువడ్డాయి. తమ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలియగానే టీడీపీకి చెందిన ఇసుక మాఫియా గద్దల్లా వాలింది. సోమశిల నుంచి పల్లిపాడు వరకు గతంలో ఏర్పాటు చేసిన రీచ్‌ల వద్ద నీరు లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో దొరికినంత ఇసుకను వందల సంఖ్యలో వాహనాలతో యథేచ్ఛగా తరలించడాన్ని ప్రారంభించారు. ఈ ప్రాంతాల్లో రీచ్‌లు ఏర్పాటు కాకుండా.. అధికారుల నిఘా లేకుండా ఆ పార్టీ నేతలు చర్యలు చేపట్టి సఫలీకృతులయ్యారు. అనుకుందే తడవుగా పాత రీచ్‌ల వైపు సంబంధిత అధికారులు, పోలీస్, రెవెన్యూ శాఖలు వెళ్లకుండా అధికార పార్టీ పెద్దలు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇసుక అక్రమ తరలింపు అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది.



పల్లిపాడు ఇసుక డిపో వద్ద బారులుదీరిన లారీలు

అక్రమ రవాణాను ఆపొద్దని హుకుం

జిల్లాలో ఇసుక అక్రమ రవాణాలో పాలుపంచుకుంటున్న అధికార పార్టీ పెద్దలు మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను ఎక్కడా ఆపొద్దని ఆదేశాలు జారీ చేశారనే టాక్ నడుస్తోంది. గత నెల నుంచి ఈ వ్యవహారం సాగుతున్నా, ఎక్కడా పట్టుకున్న దాఖలాల్లేకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. మరోవైపు గుంటూరు, విజయవాడ నుంచి కొందరు అధికార పార్టీ నేతలు వచ్చి నెల్లూరులో ఉండే ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని అధికార పార్టీ నేతలు చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు ఇసుకను జోరుగా అక్రమ రవాణా చేస్తూ కోట్లు గడిస్తున్నారని సమాచారం.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన విక్రమ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

కలిసికట్టుగా సాగుదాం

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం

ఆత్మకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పార్టీ ఒకే కుటుంబంలా పనిచేస్తుందని.. గెలుపోటములు సహజమని.. ఇలాంటి పరిస్థితుల్లో అందరూ కలిసికట్టుగా ముందుకెళ్దామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాకాణి మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ ఓటమికి ఎవరూ కుంగిపోవద్దని.. కార్యకర్తలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శిలాఫలకాలను పగలగొట్టిన వారే తిరిగి నిర్మించేలా చేస్తామని, ఎలాంటి భయాందోళనలు వద్దని పేర్కొన్నారు. పార్టీ మరోసారి విజయం సాధించి, జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమని చెప్పారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు

కొన్ని గ్రామాల్లో టీడీపీ అరాచకాలు మితిమీరుతున్నాయని, కక్షసాధింపు రాజకీయాలు చేయడం తమ పార్టీ నేతలకు చేతకాదన్నారు. అభివృద్ధిపై దృష్టి సారించాలని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. వారు పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదని.. జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యకర్తలు, నేతలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ చక్రవర్తి, మేరిగ మురళీధర్, పార్టీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, ఖలీల్ అహ్మద్, జెడ్పీటీసీలు మల్లు సుధాకర్‌రెడ్డి, పీర్ల పార్థసారథి, పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరా.. మాకొద్దు మహాప్రభో..!

ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నిర్వహణ పూర్తిగా గాడితప్పింది. సీడీపీఓతో పాటు పలు ముఖ్యమైన పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు ఉన్న వారు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇక్కడి పరిస్థితి దయనీయంగా మారుతోంది. ప్రాజెక్ట్ పరిధిలోని కేంద్రాలను ఎప్పుడు తెరుస్తారో.. ఎప్పుడు మూస్తారో తెలియని పరిస్థితి. ఈ పరిణామాల క్రమంలో లబ్ధిదారులకు సరుకులు అందడం మృగ్యమవుతోంది. అధికారులు, సిబ్బంది చేతివాటంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది.

- గాడి తప్పిన స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నిర్వహణ
- ఇక్కడికి రావాలంటేనే హడల్
- మెడికల్ లీవుపై సీడీపీఓ లావణ్య
- వేరే చోటకు బదిలీకి యత్నం
- మిగిలిన వారి పరిస్థితీ ఇంతే..
- ఇన్‌చార్జి సీడీపీఓలూ ముఖం చాటేస్తున్న వైనం



ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. వాస్తవానికి జిల్లాలో పెద్దదిగా ఉన్న ఈ ప్రాజెక్ట్‌ను పాలన సౌలభ్య రీత్యా రెండేళ్ల క్రితం పలు మార్పులు చేశారు. మర్రిపాడు మండలాన్ని ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం ప్రాజెక్ట్‌లో కలిపారు. దీంతో నాలుగు మండలాల పరిధిలో ఉదయగిరి ప్రాజెక్ట్ ఉంది.

దీర్ఘకాలంగా పలు పోస్టులు ఖాళీ

ఉదయగిరి ప్రాజెక్ట్ ఎంతో విశాలమైంది. ఇందులో వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం, ఉదయగిరి మండలాలు ఉన్నాయి. దీన్ని తొమ్మిది సెక్టార్లుగా విభజించారు. వీటి పరిధిలో 173 మెయిన్, 35 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇక్కడ రోజూ సుమారు నాలుగు వేల మంది వరకు తల్లీబిడ్డలు, గర్భిణులు పౌష్టికాహారాన్ని పొందుతున్నారు. వీరందరికీ సరుకులు సక్రమంగా అందాలంటే పర్యవేక్షణ అత్యంత కీలకం. దీనికి సంబంధించిన సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇక్కడికి రాలేము.. సారీ

ఈ ప్రాజెక్ట్‌లో వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి, నర్రవాడ, దుత్తలూరు, ఉదయగిరి 1, 2, 3, సీతారామపురం, ఎస్సార్‌నగర్ సెక్టార్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇద్దరు సూపర్‌వైజర్లే విధుల్లో ఉన్నారు. మరో సూపర్‌వైజర్ దీర్ఘకాలంగా సెలవులో ఉన్నారు. సీడీపీఓ లావణ్య సైతం రెండు నెలల నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నారు. నిజాయతీతో విధులు నిర్వర్తించే అమె ఇక్కడి పరిస్థితులను గాడిలో పెట్టలేక వేరే చోటకు వెళ్లేందుకు యత్నిస్తున్నారని సమాచారం. మరోవైపు ఇక్కడికి ఇన్‌చార్జీలుగా వచ్చేందుకు సైతం ఎవరూ ఇష్టపడటంలేదు. దీంతో ఓ సూపర్‌వైజరే ఈ విధులనూ నిర్వర్తిస్తున్నారు. ఓ జూనియర్ అసిస్టెంట్ సైతం బదిలీ యత్నాల్లో ఉన్నారు. మరో ఇద్దరు కాంట్రాక్ట్ సిబ్బంది ఉన్నా, ఒకర్ని బదిలీ చేయించేందుకు ఓ యూనియన్ నాయకురాలు విశ్వప్రయత్నం చేస్తున్నారని తెలుస్తోంది. ఇదే జరిగితే క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు కార్యాలయ సిబ్బంది కరువయ్యే ప్రమాదం ఉంది. ప్రాజెక్ట్‌లోని సీడీపీఓ.. ఖాళీగా ఉన్న ఏడు సూపర్‌వైజర్ల పోస్టులను భర్తీ చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఉదయగిరి ప్రాజెక్ట్‌పై పూర్తి అవగాహన ఉన్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ దీనిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నియామకాల్లో అక్రమాలపై విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): వైద్యశాఖలో గతంలో హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులపై విచారణను గుంటూరు నుంచి వచ్చిన వైద్యశాఖ రీజినల్ డైరెక్టర్ కార్యాలయాధికారులు బుధవారం చేపట్టారు. సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో గల డీఎంహెచ్‌ఓ పెంచలయ్య చాంబర్‌లో విచారణను నిర్వహించారు. తమకు అన్యాయం జరిగిందని పలువురు హెల్త్ అసిస్టెంట్ అభ్యర్థులు తెలియజేశారు. తనకు ఎస్సీ రిజర్వేషన్ ఉండి.. మార్కులెక్కువగా వచ్చినా, ఓసీ కేటగిరీకి చెందిన వ్యక్తికి ఉద్యోగమిచ్చారని వివరించారు. భర్తీ చేసిన ఉద్యోగాల మెరిట్ లిస్ట్, రిజర్వేషన్ జాబితాను పరిశీలించారు. అనంతరం వైద్యశాఖ డీడీ శ్రీనివాసులురెడ్డి, ఆర్డీ కార్యాలయ సూపరింటెండెంట్ షరీఫ్ మాట్లాడారు. క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కాగా పోస్టుల భర్తీ ప్రక్రియ నాటికి తాను బాధ్యతల్లో లేనని డీఎంహెచ్‌ఓ చెప్పారు.

దుర్గమ్మ సేవలో మంత్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుటుంబసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఈఓ రామారావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని వేద పండితుల ఆశీర్వచనాన్ని అందుకున్నారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను ఈఓ అందజేశారు. అనంతరం మల్లేశ్వరస్వామి, యాగశాల, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్మాణం పూర్తయిన యాగశాలతో పాటు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈఓ తెలియజేశారు.



విద్యుత్ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో నెల్లూరు టౌన్, రూరల్ డివిజన్ల విద్యుత్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని, అలా కాని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు. లో ఓల్టేజీ సమస్యలు తలెత్తకూడదని.. తీగలకు అల్లుకున్న చెట్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. 33 కేవీ లైన్ల పెట్రోలింగ్‌ను కచ్చితంగా నిర్వహించి నివేదికలను కేంద్ర కార్యాలయానికి పంపాలన్నారు. నెల్లూరు టౌన్, రూరల్ ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, శ్రీధర్, డీఈఈలు మధుసూదన్‌రెడ్డి, కిరణ్, అశోక్, భానునాయక్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు

జంప్ రోప్ పోటీలకు ఎంపికలు

కావలి: జంప్ రోప్ సబ్ జూనియర్స్ పోటీలకు సంబంధించిన ఎంపికలను పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం రెండుకు నిర్వహించనున్నామని జంప్ రోప్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మురళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్ల వయస్సు గల వారు ఎంపికలకు అర్హులని చెప్పారు. జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని, వివరాలకు 89190 36160 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జాబ్ మేళా

నెల్లూరు(మినీబైపాస్): జాబ్ మేళాను శుక్రవారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి వినయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సురెన్స్, సంగీత మొబైల్స్, ఆదిత్య బిర్లా లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు గానూ జాబ్‌మేళాను నిర్వహించనున్నామని చెప్పారు. క్యాషియర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ మేనేజర్ ఉద్యోగాలకు పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన వారు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

వికసించిన విద్యా కుసుమం

గేట్‌లో వింజమూరు విద్యార్థికి 224వ ర్యాంక్



తిప్పిరెడ్డి శ్రీను

వింజమూరు(ఉదయగిరి): ప్రతిభకు పేదరికం అడ్డురాదని వింజమూరుకు చెందిన పేద విద్యార్థి తిప్పిరెడ్డి శ్రీను నిరూపించారు. పట్టణంలో సాధారణ కుటుంబంలో పుట్టిన శ్రీను చిన్నతనం నుంచి చదువులో ఉత్తమ ప్రతిభ చూపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగా ఉన్నా, గేట్‌లో ఉత్తమ ర్యాంక్‌ను సాధించి ఉన్నత స్థానాన్ని అధిరోహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ 8వ తరగతిలో ఎన్నెమ్మెమ్మెస్ స్కాలర్‌షిప్ సాధించి ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇంటర్ వరకు పొందారు. 2017 - 18లో పదో తరగతిలో 10 జీపీఏ సాధించి అప్పటి కలెక్టర్ ముత్యాలరాజు చేతుల మీదుగా ప్రతిభ అవార్డును అందుకున్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి మెకానికల్ ఇంజినీరింగ్‌లో బెస్ట్ అవుట్‌గోయింగ్ విద్యార్థిగా అవార్డును అందుకున్నారు. 2024 గేట్ పరీక్షలో జాతీయ స్థాయిలో 224వ ర్యాంక్‌తో ఢిల్లీలోని ఐఐటీలో ఎంటెక్ సీటు సాధించారు. గేట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాల కోసం ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు. ఇందులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్‌లో రూ.20 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించారు. ఈ క్రమంలో ఆయన్ను వింజమూరులో ఉపాధ్యాయ బృందం సత్కరించింది.

క్లుప్తంగా

ఆత్మహత్యకు యత్నించి..

• వేర్వేరు గ్రామాల్లో ఇద్దరి మృతి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలంలోని రెండు గ్రామాల్లో వేర్వేరు కారణాలతో ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. పోలీసు కథనం మేరకు.. పుదూరు పంచాయతీ అత్తిపాశేనికి చెందిన పి.వెంకటేష్ (34) రెండు రోజుల క్రితం భార్య పల్లవితో గొడవ పడి కొట్టాడు. ఆమె బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది వెంకటేష్ మంగళవారం రాత్రి పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ అతను మృతిచెందినట్లు పోలీసులకు బుధవారం సమాచారం అందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా కాపులూరుకు చెందిన సన్నారెడ్డి వెంకటమ్మ (78)కు మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో 8వ తేదీన ఆమె ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. కుటుంబసభ్యులు గుర్తించి నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటమ్మ మృతిచెందినట్లు బుధవారం పోలీసులకు సమాచారం అందింది. మృతురాలి కుమారుడు సన్నారెడ్డి జనార్దనరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కండలేరులో 6.321 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 6.321 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మైనర్లు రయ్.. రయ్

మోటార్‌బైక్‌లు కొనిస్తున్న తల్లిదండ్రులు

• కౌన్సెలింగ్ ఇస్తున్నా మారని తీరు
• తరచూ ప్రమాదాలు...ప్రాణనష్టాలు

మా వాడికి బైక్ కొనిచ్చాం. ఫ్రెండ్స్‌ని ఎక్కించుకుని ఎంత బాగా తిరుగుతున్నాడో.. అంటూ కొందరు తల్లిదండ్రులు మురిసిపోతుంటారు. తీరా చూస్తే కుమారుడు పదో తరగతో లేక ఇంటర్మీడియట్ చదువుతూ ఉంటాడు. మైనర్లు మోటార్‌బైక్‌లను వేగంగా నడుపుతూ హల్‌చల్ చేస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో వారి స్పీడుకు బ్రేకుల్లేకుండా పోయింది. చిన్నపాటి వీధుల్లోనూ ఇష్టానుసారంగా తిరిగేస్తున్నారు.

నెల్లూరు(క్రైమ్): గడప దాటి రోడ్డెక్కితే ఇంటికి క్షేమంగా చేరుకుంటామన్న గ్యారెంటీ లేకుండాపోతోంది. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వెళ్తున్నా సరే మైనర్లు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ఘటనల్లో కొందరు ప్రాణాలను కోల్పోతుంటే మరికొందరు ఇతరుల ప్రాణాలు తీస్తూ బాధితుల కుటుంబాల్లో తీరని ఆవేదనను మిగులుస్తున్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని ట్రాఫిక్ నిబంధనలున్నా వారు బేఖాతరు చేస్తున్నారు. మైనర్లు చేతికి వాహనం ఇవ్వరాదని చెబుతున్నా తల్లిదండ్రులు సైతం పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో ప్రతి నెలా సగటున 30 నుంచి 40 మందికి పైగా మైనర్లు వాహనాలను నడుపుతూ పట్టుబడుతున్నారు. వారిలో ఎక్కువమంది ట్రిపుల్ రైడింగ్ చేస్తూ దొరికిపోతున్నారు. తల్లిదండ్రులను పిలిచి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా ఫలితం ఉండడం లేదు.

అదే ప్రమాదం

అతి గారాబమో.. పిల్లలు అలిగారనో.. హోదా కోసమో చాలామంది తల్లిదండ్రులు ఖరీదైన వాహనాలను పిల్లల చేతికి ఇస్తున్నారు. అదే వారికి ప్రమాదకరంగా మారుతుందన్న విషయాన్ని గుర్తించలేకపోతున్నారు. తెలియనితనం, వచ్చీరానీ డ్రైవింగ్‌తో విన్యాసాలు చేస్తూ పిల్లలు ప్రమాదాలకు కారణమవుతున్నారు. మైనర్ల అత్యుత్సాహం వారి ప్రాణాలకే కాదు ఎదుటవారి ప్రాణాలకు భద్రత లేకుండా చేస్తోంది. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామాల్లోనూ మైనర్ల చేతుల్లో వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాద ఘటనపై ఫిర్యాదు చేసేందుకు అధిక శాతం మంది పోలీసుస్టేషన్ వరకు వెళ్లడం లేదు. కేసు అవుతుందని బయటే రాజీలు చేసుకుంటున్నారు. మరికొన్ని ఘటనల్లో పోలీసుల వరకు వెళ్లినా పిల్లల భవిష్యత్ దృష్ట్యా ఇరువర్గాలకు రాజీమార్గమే చూపుతున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేస్తున్నా ఇంకా కొందరిలో మార్పురావడం లేదు. వాహనాలు ఇస్తూనే ఉన్నారు. ఇటీవల ఓ బాలుడు బైక్ నడుపుతూ పట్టుబడగా పోలీసులు అతడి తల్లిదండ్రులను పిలిచి మాట్లాడగా 'ఏం చేస్తాం సర్.. బైక్ ఇవ్వకపతే చచ్చిపోతానని, ఇంట్లో నుంచి వెళ్లిపోతానని బెదిరించాడు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

బీమా రాదు

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం ఎంత నేరమో.. పిల్లలకు వాహనాలు ఇవ్వడం కూడా అంతే నేరం. మోటార్ వాహనాల చట్టం ప్రకారం 16 ఏళ్లు నిండిన వారు గేర్లు లేని మోటార్‌బైక్ నడిపేందుకు అర్హులు. 18ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతే వాహనాలు నడపాలని చట్టం చెబుతోంది. అలా కాకుండా బైక్ నడిపితే తల్లిదండ్రులు కూడా బాధ్యులవుతారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదానికి కారకులైతే సంబంధిత వాహన యజమాని సైతం కేసులో నిందితుడు అవుతాడు. మైనర్ డ్రైవింగ్‌లో ప్రమాదం జరిగితే బీమా వర్తించదని పోలీసు అధికారులు చెబుతున్నారు.


స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు (ఫైల్)

వదిలేస్తే విషాదమే..

➡ నెల్లూరు నగరం శెట్టిగుంటరోడ్డుకు చెందిన ఓ బాలుడు సెలూన్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకోసాగాడు. అతను మోటా ర్‌బైక్‌పై ఆత్మకూరు బస్టాండ్ ఫ్లై ఓవర్ మీదకు వచ్చేసరికి వేగాన్ని నియంత్రించలేక అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

➡ మూలాపేటకు చెందిన ఓ బాలుడు తన స్నేహితులను బైక్‌పై ఎక్కించుకుని వేగంగా పోతూ నడిచి వెళ్తున్న ఓ వృద్ధుడిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో వృద్ధుడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాలుడి తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేశారు.

కారణాలిలా..

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం. మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనం నడపడం. సెల్‌ఫోన్ డ్రైవింగ్, పరిమితికి మించి ప్రయాణం. హెల్మెట్ ధరించకపోవడం, ఓవర్‌టేకింగ్ ప్రమాదాలకు కారణాలుగా పోలీసు అధికారులు చెబుతున్నారు.


ఏ మాత్రం భయం లేకుండా ముగ్గురు వెళ్తూ..


వాహనం నడుపుతున్న స్కూల్ విద్యార్థి

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



వాహనాలు నడుపుతూ మైనర్లు ఎక్కువగా పట్టుబడుతున్నారు. వారికి జరిమానాలు విధించడంతోపాటు తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వడం సరికాదు. ఏదైనా ప్రమాదం జరిగితే మైనర్లతోపాటు తల్లిదండ్రులు సైతం ఆ బాధ భరించాల్సి వస్తుంది. తల్లిదండ్రుల్లో మార్పు రావాలి. పిల్లల సరదా కోసం ఆలోచిస్తే వారితోపాటు బయటి వారు ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది.

– పి.శివాజీ, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అంగన్‌వాడీల నిరసన

రాపూరు: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. బుధవారం రాపూరులోని అంగన్‌వాడీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటరత్నానికి వినతిపత్రం సమర్పించారు.


రాపూరులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అధికారులు వచ్చారు.. వెళ్లారు

• మహిళా మార్టులో ఏడీ తనిఖీలు
• అవినీతిపై స్పందించని వైనం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో సెర్ప్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా మార్టుపై ఇటీవల అవినీతి ఆరోపణలు రావడంతో బుధవారం రాష్ట్ర సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ ఎం.మహిత తనిఖీలు చేశారు. స్టాక్ గురించి ఆరాతీశారు. నాసిరకం సరుకుల పంపిణీ, అధిక ధరలకు విక్రయాలు, మార్ట్ నిధుల గోల్‌మాల్ తదితర అంశాల గురించి సిబ్బందిని అడిగి తెలుసున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పొదుపు సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. మార్టులో జరిగిన అవకతవకలు, షేర్ ధనం గోల్‌మాల్ తదితర వాటి గురించి అడిషనల్ డైరెక్టర్‌కు సభ్యులు వివరించారు. లాభాల బాటలో నడుస్తున్న మార్టును అధికారులు అవినీతితో నష్టాలబాట పట్టించడంతో మూసివేతకు దారి తీసిందని చెప్పారు. ఈ విషయంలో జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారుల పాత్ర ఉందని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. లోపాలు సరిచేసి మార్టు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని మహిళలకు ఏడీ భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 51 మహిళా మార్టులున్నట్లు చెప్పారు. ఐదారు తప్ప మిగిలినవి బాగా నడుస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో కందుకూరు, వింజమూరులో మార్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మార్టులో జరిగిన అవినీతి గురించి ప్రస్తావించగా.. పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని దాటవేశారు. డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి మాట్లాడుతూ మార్టులో నాసిరకం సరుకుల పంపిణీ, సభ్యులకు అప్పులిచ్చి రికవరీ చేయకపోవడంపై సీపీని సస్పెండ్ చేశామన్నారు. ఇప్పుడు అంతా సజావుగా ఉందని చెప్పే ప్రయత్నం చేశారు. మార్టులో జరిగిన అవినీతి గురించి పూర్తిస్థాయిలో వెల్లడించేందుకు సుముఖత చూపలేదు. ఏడీ తనిఖీలతో అవినీతి వ్యవహారం పూర్తిస్థాయిలో వెలుగు చూస్తుందని భావించిన పొదుపు సంఘాల సభ్యులకు నిరాశే మిగిలింది.


పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడుతున్న ఏడీ

భారతి సిమెంట్ డీలర్స్ సమావేశం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని మినర్వా హోటల్లో బుధవారం భారతి సిమెంట్ జిల్లా డీలర్స్ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) ఎంసీ మల్లారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ప్రారంభం నుంచే ప్రజలకు చేరువగా ఉందన్నారు. వినియోగదారుల మన్ననలు పొందుతోందని గుర్తుచేశారు. ఏడాదికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని కంపెనీ సాధిస్తోందని తెలిపారు. జర్మన్ టెక్నాలజీతోపాటు, రోబోటిక్ ల్యాబొరేటరీ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు పోతోందన్నారు. తాపీమేస్త్రీలకు ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తూ అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సంస్థ అసిస్టెంట్ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) టి.కొండల్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ ఏవీ జయవర్ధన్‌రెడ్డి, టెక్నికల్ సర్వీసెస్ డీజీఎం ఓబుల్‌రెడ్డి, మార్కెటింగ్ జిల్లా డిప్యూటీ మేనేజర్ జేఎస్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో పాతనేరస్తుడి అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ వీరానాయక్, చిత్రంలో ఎస్సైలు

• రూ.2.79 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): వ్యసనాలు అతడిని దొంగగా మార్చాయి. 15 ఏళ్ల వయస్సు నుంచే చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కాడు. అయినా ప్రవర్తనలో మార్పు రాలేదు. తాజాగా ఇంటి దొంగతనం కేసులో నెల్లూరు బాలాజీ నగర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రూ.2.79 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. బుధవారం బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్ తన కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. బాలాజీ నగర్ సీఆర్పీ డొంకకు చెందిన మస్తాన్ చిన్నతనం నుంచే జల్సాలు, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. స్నేహితులతో కలిసి చిల్లర దొంగతనాలకు పాల్పడసాగాడు. 2013లో తన సహచరులతో కలిసి ఇంటి దొంగతనాలకు పాల్పడుతుండగా బాలాజీ నగర్ పోలీసులు అరెస్ట్ చేసి తిరుపతిలోని జువైనల్ హోంకు తరలించారు. అక్కడి నుంచి బయటకు వచ్చినా మస్తాన్ మారలేదు. ఈ ఏడాది మార్చిలో బాలాజీ నగర్ సీపీఎం కార్యాలయం సమీపంలో విశ్రాంత రైల్వే ఉద్యోగి కె.వెంకట విజయభాస్కర్‌రెడ్డి ఇంట్లో 145 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలు, సాంకేతికత ఆధారంగా నిందితుడిని మస్తాన్‌గా గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం మస్తాన్‌ను అరెస్ట్ చేసి రూ.2.79 లక్షల విలువ చేసే 18 జతల బంగారు చెవికమ్మలు, గొలుసు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టేందుకు కృషి చేసిన ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఎస్సైలు విజయశ్రీనివాస్, సుబాని, ఏఎస్సై శ్రీనివాసరాజు, హెడ్‌కానిస్టేబుల్స్ కేవీ సుధాకర్, సీహెచ్ శివకుమార్, రమేష్, వెంకటరావు, కానిస్టేబుళ్లు ఎ.తిరుపతి, హరి, ఓవీఎస్ ప్రసాద్, సాయి కిశోర్‌లను ఏఎస్పీ అభినందించారు.

మమ్మల్ని లెక్క చేసేది ఎవరు?

• మత్స్యశాఖ అధికారుల ఆవేదన
• ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసే అవకాశం

కోవూరు: 'పక్క రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా చికెన్ వేస్ట్ వాహనాలు జిల్లాకు వచ్చి కళ్ల ముందు తిరుగుతున్నా మేము చేసేదేమీ లేదు. మమ్మల్ని లెక్క చేసేది ఎవరు' అంటూ మత్స్యశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చికెన్ వ్యర్థాల వాహనాలను పట్టుకుని పోలీసులకు అప్పగించినా కేసు కట్టకుండా వదిలేయడం జరుగుతోందని, ఈ నేపథ్యంలో ఎన్ని వాహనాలు పట్టుకున్నా ఉపయోగం లేదంటున్నారు. కోవూరు అడ్డాగా జరుగుతున్న చికెన్ వ్యర్థాల వ్యాపారంపై బుధవారం సాక్షిలో 'కోళ్ల వ్యర్థాలతో రూ.కోట్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా అధికారుల సూచనల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. స్వాత్తు జిల్లా మత్స్యశాఖ అధికారులు దాడులు చేసి చికెన్ వేస్ట్ వాహనాలు పట్టుకుంటే అతీగతి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. కలెక్టర్ చొరవతో కొన్ని కేసులు కట్టడం జరిగిందని వాపోతున్నారు. వాహనాలను సీజ్ చేసి కోర్టుకు పెడితే దీనికి అడ్డుకట్టపడే అవకాశం ఉంటుందంటున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.56
సన్నవి	రూ.40
పండ్లు	రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	131	బ్రాయిలర్ స్కిన్‌లెస్	264
లేయర్ (లైవ్)	115	లేయర్ చికెన్	195
బ్రాయిలర్ చికెన్	236		

